తెలుగు కళాసమితి న్యూజెర్సీ 1988 ఉగాది మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# ఆత్రోళ్ళకు వసంతం రాదు!



"పట్టుకోండి... పట్టుకోండి"

కలవరంతో కూడిన సు మిత ఆర్తనాదం వినిపించింది. నా అందమైన కల అంతర్ధానమయింది. కరెంటు పోయినప్పటి టి.వి. సీరియల్ లా... నీళ్లు ఒలికి తడిసి పోయిన అసం. పూర్ణ వర్ణచిత్రంలా... ఉలిక్కిపడి లేచాను. చాలా రాత్రుల లాగే - కరెంటు లేదు. అందుబాటులో ఉన్న టార్చిలైటు తీసుకొని టైము చూశాను-పన్నెండున్నర! గది తలుపులు తెరుచుకొని బయటకు పరిగెత్తాను. అప్పటికే నలుగురైదుగురు ఆడాళ్ళు, ఇద్దరు ముగ్గురు మగాళ్లు చేరారు. వాకిట్లో రెండు హరికెన్ లైట్లు వెలుగుతున్నాయి.

"నా చేతికి దొరికినోడే - గిజాయించుకొని పోయాడు" పక్కింటి ముసలాయన గవ్రరాజు ఆవేశ పడుతున్నాడు.

"ఏం జరిగింది? దొంగలు పడ్డారా?" నాకంతా అయోమయంగా ఉంది.

నా ప్రశ్నకు వెంటనే ఎవరూ సమాధానం చెప్పలేదు. లోపల్నుంచి వెక్కిళ్ల వినిపిస్తున్నాయి.

"బయటి దొంగలు కాదు! ఆవిడ మొగుడే. మంగళ సూత్రం తెంచుకుని పారిపోయాడు"- నన్ను పక్కకు తీసుకెళ్ళి గవ్రరాజుచెప్పాడు.

"వీధి చివరి వరకూ వెళ్లాను. అందకుండా దాటేశాడు."

అప్పుడే వచ్చిన మరో యువకుడు వగరుస్తూ విలబడ్డాడు.

ఈ హడావుడికి జనం వచ్చి చేరుతున్నారు... సు మిత్ర పట్ల సానుభూతి చూపిస్తున్నారు. అంతకు మించి ఏమీ చేయలేని నిస్సహాయమైన స్థితి...

"మాష్టారూ, పోలీసు కంప్లయింటు ఇవ్వడం మంచిది కదా! ఆమె వద్దంటోంది" నన్ను ఉద్దేశించి గవ్రరాజు అన్నాడు.

"ఇంతకీ చలపతిగారు లేరా?"

"ఉన్నారు. పెళ్లాం, మొగుడు కూడా బయటకు రాలేదు. ఆళ్ల పట్టించుకుంటే ఈడిలా ఎందుకు పేట్రేగుతాడు? పరాయోళ్లకున్న జాలి కూడా ఆళ్లకి లేదు - ఛీ! ఛీ! ఏం మనుషులు?" కడుపు మండిన గవ్రరాజు భార్య చిన్నమ్మ బహిరంగంగానే సుమిత్ర అత్తమామలను తిడుతోంది.

"వాళ్లకు మెలకువ రాలేదేమో! ఎవరైనా లేపారా?"

"మాష్టారూ, మీ చాదస్తం గానీ మనందర్నీ లేపితేనే వచ్చామా? ఇంత హడావుడి జరుగుతున్నా లేచి రాలేదంటే అర్థం కావడం లేదు! ఆ సుమిత్రే ఒప్పుకుంటే వాళ్లు కూడా కుమ్మక్కయ్యారని ముగ్గురి మీద కేసుపెట్టాలి" గవ్రరాజు కూడా ఆవేశ పడుతున్నాడు.

"గవ్రరాజు గారూ! ఇది సున్నితమైన కుటుంబ సమస్య. మధ్యలో మనం కంగారు పడ్డం మంచిది కాదు!"

గవ్రరాజు దంపతుల్ని శాంత పరిచి, నేనే వెళ్లి చలపతి గారి తలుపు తట్టాను.

కేకలేశాను. చివరికి ముసలావిడ వచ్చి తలుపు తీసి, "మాష్టారు, ఆయనకు ఒంట్లో బాగాలేదు. పొద్దుట మాట్లాడండి"అని నా సమాధానం కోసం ఎదురు చూడకుండా తలుపు వేసేసుకొంది.

"మేం చెప్పలేదూ! అంతా నాటకం. కొడుక్కి తగ్గ తల్లీ తండ్రీ. కటికోళ్లు" జరిగింది విని అక్కడ ఉన్న వాళ్లంతా సు మిత్ర అత్తమామలను తిట్టి పోశారు.

"సర్లెండి! ఉదయం చలపతి గారితో మాట్లాడిన తరువాత ఏం చేయాలో నిర్ణయిద్దాం. ఈ జాగారమెందుకు? పోయి పడుకుందాం!"

నా ప్రతిపాదన కంగీకరించి, జనం ఒక్కొక్కరు వెళ్లి పోయారు. గవర్రాజు భార్య సు మిత్ర నోదార్చి, తోడుగా పడుకొంది.

నాకు మాత్రం ఆ రాత్రి చాలా సేపు నిద్ర పట్టలేదు... నా ఆలోచనలు సుమిత్ర చుట్టూ తిరుగుతున్నాయి. నేను ఈ ఊరొచ్చి రెణ్ణెల్లు కావస్తోంది. పదేళ్లుగా సొంత ఊళ్లో ఉద్యోగం చేసుకొంటూ కడుపులో నీళ్ల కదలకుండా ఉన్న నాకు ఈ బదిలీ వచ్చి అవస్థ పెట్టింది. మా ఆవిడ 'ఏ ఊరయితేనేం వెళ్దాం' అని తయారయినా, మా నాన్నగారు, 'ఫ్యామిలీ పెట్టడం ఎందుకురా ఖర్చు? డెబ్బై కిలోమీటర్ల దూరమేగా! వారం వారం వస్తుందువుగాని' అని నచ్చజెప్పి, ఒంటరిగా ఉండటానికొప్పించారు.

ఊళ్లో అద్దె ఇళ్ల కోసం గాలిస్తుంటే చలపతి గారిల్లు బావుందనిపించింది. ఆ ఇంట్లో రెండు భాగాలున్నాయి. ముందు రీ మోడల్ చేసిన డాబా! వెనుక పెంకుటిల్లు. డాబా పోర్షనులో సు మిత్ర అయిదేళ్ల కూతురు ఉంటున్నారు. భర్త రాజారావు ఎప్పుడో గాని ఇంటికి రాడని ఆ పోర్షన్‌లోని వీధి గదిలో చేరిన తరువాతే అర్థమయింది. వెనుక అత్తా,మావా ఉంటున్నా ఆమెకు తోడు లేని ఆ ఇంట్లో నాలాంటి పెళ్లయిన ఒంటరి గాడికి చోటివ్వడం ఆశ్చర్యమేననిపించింది. అది బహుశా నా వృత్తి మీది గౌరవం వల్ల అనుకున్నాను.

రెణ్ణెల్లుగా సు మిత్ర తత్వం నాకు అర్థం కావడం లేదు. పల్లెల్లో సాధారణంగా ఉండే కలుపుగోలుతనం, మర్యాద ఆమెలో లేవు. ఊరు నుంచి వేళకాని వేళ వచ్చినా మంచినీళ్లు కావాలా అనిగాని, మజ్జిగ కావాలా అని గాని ఎప్పుడూ అడిగి ఎరగదు. సుమిత్రది మనస్సును గిలిగింతలు పెట్టే అందమే! ఆమెను ఎప్పుడో ఎక్కడో చూసిన జ్ఞాపకం. కాని గుర్తుకు రావడం లేదు. అడుగుదామంటే ఎప్పుడూ మాట్లాడిన పాపాన లేదు. కాని అప్పుడప్పుడు చదువుకోవడానికేమైనా పుస్తకాలు ఇమ్మని మాట్లాడితే కష్టమంటుందేమోనవేలా ప్రవర్తిస్తుంది. అలాంటి అందమైన భార్యను ఆ రాజారావు ఎందుకు విడిచిపెట్టే ఉంటున్నాడు? అతనికి లేని వ్యసనం లేదట! పట్నంలో ఎవరో ఉంపుడు కత్తె కూడా...

నేను ఆ గదిలో చేరిన తరువాత అతను రెండు సార్లే కనిపించాడు. మొదటి సారి వెళ్లిన మూడు వారాలకు! రెండవసారి నిన్న చీకటి పడుతుండగా... కరెంటు లేక

ఉక్క పెడుతుంటే ఆరుబయట కుర్చీలో చేరబడి వుండగా వచ్చి పలకరించాడు. ఏవైనా అప్పు అడుగు తాడేమోనని భయపడ్డాను. కాని చాలా ఆత్మాభిమానం కలవాడిలా కనిపించాడు.

రాకరాక వచ్చిన భర్త...ఆ రాత్రి సుమిత్ర ఆనందాన్ని ఊహించుకొంటూపడుకొన్నాను. ఆ ఊహల ఉయ్యాల మీద నా మాధురి కలలోకొచ్చి కవ్వి స్తుండగా... అంతలో సుమిత్ర ఆర్తనాదం!

తెల్లవారు ఝామున నిద్రపట్టిన నేను తలుపు తట్టిన చప్పుడుకు బద్ధకంగా లేచాను. దలపతిగారు!

ఆయన చాలా సేపు మాట్లాడారు.

ఆయన కడుపు చించుకుంటే కాళ్ల మీద పడు తుందని బయటకు రాలేదట. కొడుకును తను వచ్చి పట్టుకొని ఆపితే మాత్రం మరోనాడు ఆ మాంగల్యాన్ని పట్టుకుపోలేడా అని ఆయన ప్రశ్న! అందువల్ల భార్య భర్తను ఆకట్టుకోవాలి గానీ వీధిలో పెట్టి ప్రయోజనం లేదట. సుమిత్రకు చదువు లేని రాజారావంటే ఇష్టం లేదట. అందుకే అతనుమరింత దూరమవుతున్నాడట. రాజారావు ఆస్తికి ఆశపడి సుమిత్ర తండ్రి, కూతురి గొంతు కోశాడట. ఆమె అతనితో సుఖపడ లేక పోతోంది. అతణ్ణి సుఖపెట్టలేక పోతోంది. ఇంతకూ సుమిత్ర పరాయి పిల్లకాదట. తన మేన కోడలేనట! ఆ మాంగల్యం కొడుకు ఎక్కడ తాకట్టు పెట్టాడో తెలుసు కొని విడిపించి తెస్తాడట - పెద్దగా చదువుకోక పోయినా దలపతి విశ్లేషణ, పరిష్కారం నాకు నచ్చాయి. ఇంతలో గుమ్మంలో చప్పుడయితే చూశాను -

చేతి సంచితో నాన్నగారు!

నేను ఆశ్చర్యపడుతూ ఏవేవో అడుగుతోంటే - ఆయన అడిగిన మొదటి ప్రశ్న...

"మీ యింటివాళ్ల కోడలు నీకిస్తానన్న మాదవరం మాధవయ్య గారమ్మాయి కదరా" అని

అవును-అప్పుడు గుర్తుకొచ్చింది! నేను పదేళ్ల క్రితం పెళ్లి చూపుల్లో మొదటి సారి సుమిత్రను చూశాను. అమ్మాయి నాకు నచ్చింది. నేనంటే తను చాలా మక్కువ చూపిస్తోందని మధ్యవర్తుల ద్వారా తెలిసింది. కానీ మా పెళ్లి కాలేదు - కారణం మా ఆస్తి మాధవయ్య గారికి నచ్చలేదు, ఆయన డబ్బు మనిషి!

సుమిత్ర ఇప్పటికి నాకు అర్థమయింది. అప్పుడు నచ్చిన నాతో బతుకును పంచుకుంటానని గానీ, ఇప్పుడు నచ్చని భర్తతో తెంచుకుంటానని

గానీ బహిరంగంగా చెప్పలేని మనసు

మాత్రమే ఉన్న నోరులేని

సగటు స్త్రీ ఆమె!

పైడిపాల

# చెవిలో పువ్వు

—విశ్వనాథ పావనిశాస్త్రి



## 'రామాయన్'

గ్రగర్ రామాయణం" చిత్ర నిర్మాణ చివరి దశ మహా జోరుగా సాగుతోంది. సాగుతోంది మరి!...

ఎర్ర మేఘ శ్యాముడైన రాముడు, పీలగొంతు రావణుడు - పై కొకడు, క్రింది కొకడు వీర విహారంగా బాణాలేసుకుంటున్నారు.

ఆ బాణాలు తమకెక్కడ తగుల్తాయోనని "టెక్ని షియన్స్","బోయిస్" నానా అవస్థా పడుతున్నారు. కెమెరా వైపుగానీ, డైరెక్టర్ గారి వైపుగానీ పొరపాటు నైనా సరే బాణం ప్రయాణం చేస్తే, - తాము హాస్పిటల్ కి ప్రయాణం చెయ్యాల్సి వుంటుందని రామరావణులిద్దరికీ తెలుసు. డైరెక్టర్ మాయానంద్ గారు అతి డిసిప్లినేరియన్!

ఈ సీన్ లోనే రాముడు బ్రహ్మాండం బద్దలయ్యేట్టు బాణం వెయ్యాలి. రావణుడి కడుపులోని అమృత భాండం బద్దలవ్వాలి. భాండం బద్దలై అమృతం కడుపులో ఒలికినా సరే రావణుడు మరణిస్తాడు. ఆ ట్రిక్ ఫోటోగ్రఫీ - ఆ చిత్రీకరణ - అదంతా వేరే నిర్మాణం...... కట్!

వేరే షాట్ మొదలైంది.

'రామా!' అంటూ రావణాసురుడు ఆనందంగా నేలబడ్డాడు.

రాముడు ఎందుకో చాలా బాధపడ్డాడు.

నేలబడ్డ రావణుడు, రాముణ్ణి దగ్గరగా రమ్మని సైగ చేసి పిలిచాడు. దగ్గరి కెళ్తే చటుక్కున చుర కత్తెట్టి పొడుస్తాడేమోనని - జాగ్రత్తగా వెళ్ళాడు రాముడు. చిద్విలాసంగా నవ్వుతూ నుంచున్నాడు.

రావణాసురుడు పెద్ద "స్పీచ్" మొదలు పెట్టాడు-

"రామా! నువ్వు విష్ణువువని, నీ సీత లక్ష్మి అవీ నాకు తెలుసు. మరో విషయం చెప్తాను. ఆశ్చర్యపోకు. నేను ఎత్తుకొచ్చిన సీత ఛాయా సీత అన్న విషయం కూడా నాకు తెలుసు. అసలు సీతని ఎత్తుకునే రాకపోదును. ఆ మహాపతివ్రతని తాకితే నేను భస్మమై పోనూ! అందుకనే ఈ ఛాయా సీత నెత్తుకొచ్చాను. ఈమె అయినా నన్ను వలచి వరించకపోతుందా అను కున్నాను. ఈమె అసలు సీతకన్నా వంద రెట్లెక్కువ శోకిస్తూ అశోకవనంలో కూర్చుంది. నా ఖర్మ! ఈ ఛాయా సీత కోసం నువ్వెందుకంత ఏడ్చావో నా కర్థం కాలేదు. నీ సీతని నువ్వు అగ్నిలోంచి తిరిగి తీసుకుని నీ దారిన నువ్వు పోవచ్చు కదా! ఏది ఏమైనా నువ్వు గొప్ప నటుడివిలే! అంత గొప్ప నటుడివి, ఇంత దూరం అరణ్యం ఎందుకొచ్చావో అసలు అర్థం కావడం లేదు. అరణ్యానికి వచ్చినట్టు నటించకపోయావా?- అవ్వన్నీ నాకెందుకు? కొద్ది సేపట్లో చావబోతున్న వాడికి? ఇంత తులసి తీర్థం పొయ్యవాగొంతులో నా కొడుకు లందర్నీ చంపించావు. నా ప్రియతమ తమ్ముడు కుంభకర్ణుణ్ణి చంపావు. విభీషణుణ్ణి తులసి తీర్థం పొయ్యరా అని అడగడానికి నాకు మొహం చెల్లడం లేదు. ఆ పుణ్యం నువ్వే కట్టుకో" అని ప్రాధేయ పడ్డాడు.

రాముడు చిరునవ్వు నవ్వుతూ ఆగ్నేయాస్త్రం సంధించాడు. భూమి చిల్లు పడింది. తులసి గంగ ఆకాశానికి ఎగజిమ్మింది. ఒకప్పుడు కడుపు చీల్చి పేగుల్తో రుద్రవీణ వాయించిన రావణాసురుడు - రాముడి బాణంతో కడుపు పగిలి - కడుపునిండా తులసి నీళ్ళు త్రాగి చివరి వాయువు వదిలాడు.

అగ్ని, భూమి, గంగ, ఆకాశం, వాయువు - పంచ భూతాలు రామ కథని ఆనందంగా గానం చెయ్య సాగాయి.

* * *

ఆ రాత్రి కడుపు పగిలేట్టు తిని తాగిన రామ రావణ పాత్రధారులతో డైరెక్టర్ మాయానంద్ ఇలా శలవిచ్చారు;

"ఓరి చెవులో పువ్వులూ! వాల్మీకి ఏం రాశాడ న్నది ఎవరికీ తెలీదు. అయినా వాల్మీకి రాసినట్టు తీశామనుకో! మనకసలు రామాయణం తెలీదను కుంటారు ప్రజానీకం. అదీ గాక - ప్రపంచంలో మూడు వందల ప్రసిద్ధమైన రామాయణాలున్నాయి. అవి కాక ప్రతి భాషలో మరో మూడు మూడు వందల రామాయణాలున్నాయి. ఎవరికి తోచిన కల్ప నలు వాళ్ళు చేసేశారు. మనం అన్నీ కలిపి మసాలా చేసేశాం అనుకో. మన రామాయణం సూపర్ హిట్!! మరో విషయం! ఇంగ్లీషు సినిమాల్లో ఓ ముద్దూ, ఓ గుద్దూ ఎంత కామనో - మన సినిమాల్లో - ఓ రేపూ, ఓ డూపూ, ఓ సెంటిమెంటూ అంత కామన్! అది ప్రేమాయణమైనా సరే, రామాయణ మైనా సరే! ఇదే ఫార్ములా! జాగ్రత్త!!!"

పూలు పుయ్యని మేడి చెట్టు సరాసరి కాయలు కాచేసి, పండిపోయింది.